

2లో

## వసతి గృహ విద్యార్థుల మౌలిక వసతులకి చర్యలు తీసుకుంటాం

– సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844
జులై : 27 ఆదివారం సంపుటి : 29 సంచిక : 172

# వచ్చే రెండేళ్ల లో వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తాం



– మార్కాపురం ఎమ్మెల్యే కందుల

అగ్ని న్యూస్,దోర్నాల (జులై 26): యర్రగొండపాలెం నియోజకవర్గం లోని దోర్నాల పట్టణంలో స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, జిల్లా శాసనసభ్యులు, రాష్ట్ర బోర్డు చైర్మన్ లు, స్థానిక తెలుగుదేశం నాయకులు , భారీ ఎత్తున ప్రజలు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.మొదటగా నాయకులు దోర్నాల పట్టణంలోని పురవీధుల్లో టాప్ లేని వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ 2లో

# కార్గిల్ విజయం భారత సైనిక శౌర్యానికి నిదర్శనం



- 1999 లో కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు వందనాలు
- దేశభద్రత కోసం అత్యున్నత త్యాగం చేసిన అమరవీరులు మనందరికి గర్వకారణం
- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

అగ్ని న్యూస్,మార్కాపురం (జులై 26): కార్గిల్ విజయం భారత సైనిక శౌర్యానికి నిదర్శనమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్ దినోత్సవం సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద రాష్ట కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ భారత సరిహద్దుల వద్ద వాస్తవాధీన రేఖను 2లో

# పేదరికం లేని సమాజాన్ని రూపొందించటమే పీ 4 కార్యక్రమ లక్ష్యం

– దేవాదాయ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి





అగ్ని న్యూస్,మార్కాపురం (జులై 26): పేదరికం లేని సమాజాన్ని రూపొందించటమే లక్ష్యంగా పీ 4 కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ప్రవేశపెట్టారని రాష్ట్ర దేవాదాయ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం పై శనివారం మార్కాపురం లోని సౌజన్య ఫంక్షన్ హాలులో జిల్లా అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియ, పలువురు శాసన సభ్యులు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఇతర ఉన్నతాధికారులు 7లో

## వసతి గృహ విద్యార్థుల మౌలిక వసతులకి చర్యలు తీసుకుంటాం

మొదటి పేజి తరువాయి

అగ్ని న్యూస్,మార్కాపురం (జులై 26): వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియ తో కలిసి శనివారం రాత్రి మార్కాపురం పట్టణ శివారులోని రాయవరం అంబేద్కర్ గురుకుల పాఠశాల(బాలికలు)ను సందర్శించారు. డార్మెటరీ రూములు, టాయిలెట్లు, వంటగదిని వారు తనిఖీ చేశారు. భోజనం రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో ప్రత్యేకంగా మంత్రి, కలెక్టర్ మాట్లాడారు. నీటి సమస్య ఉందని, శానిటేషన్ సరిగా నిర్వహించడం లేదని విద్యార్థులు ఈ సందర్భంగా వారి దృష్టికి తెచ్చారు.ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి చెప్పారు. తక్షణమే ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి వెంట జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ. అర్జున్ నాయక్, సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ప్రధానోపాధ్యాయురాలు ఆశాలత,తహసిల్దార్ చిరంజీవి,ఇతర అధికారులు ఉన్నారు.

## వచ్చే రెండేళ్ల లో వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తాం

మొదటి పేజి తరువాయి

ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆంధ్రుల ఆరాధ్య దైవం స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం బహిరంగ సభలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ గత నాలుగు దఫాలుగా తెలుగుదేశం పార్టీకి ఈ ప్రాంత ప్రజలు అన్యాయం చేస్తున్నారని అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ పరిపాలనలోని వెలుగొండ ప్రాజెక్టు అభివృద్ధి జరిగిందని గత పాలకులు వెలుగొండ ప్రాజెక్టు పూర్తయిందని జాతికి అంకితం చేసి వెళ్లారని తీరా అక్కడ చూస్తే మొండి గోడలు దర్శనం ఇచ్చాయని ఇంకా వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే నాలుగువేల కోట్లు అవసరమని వచ్చే రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని అన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజలు వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్,ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఏరిక్షన్ బాబు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు శాసనసభ్యులు విజయ్ కుమార్ , గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుమల అశోక్ రెడ్డి , కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి,రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ వైస్ చైర్మన్ మరిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మీ, తదితర నాయకులు ఎర్రగొండపాలెం తెలుగుదేశం నాయకులు, భారీ ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.




## కార్గిల్ విజయం భారత సైనిక శౌర్యానికి నిదర్శనం

మొదటి పేజి తరువాయి

దాటి మన దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన పాకిస్తాన్ సైన్యాన్ని సుమారు 80 రోజుల వీరోచిత పోరాటంతో తరిమి కొట్టి, 1999 జులై 26న ఆపరేషన్ విజయ్ ను విజయవంతంగా పూర్తిచేసిన సైన్యానికి కార్గిల్ విజయ దినోత్సవ వందనాలు అని అత్యంత క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లో పర్వత శిఖరాలను పునఃప్రాపించడంలో భారత సైన్యం చూపిన ధైర్యం, వ్యూహం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందనీ అన్నారు. ఆపరేషన్ విజయ్ విజయవంతం కావడంలో ఉన్నత స్థాయి నాయకత్వం, సమిష్టి శక్తి, సైనికుల త్యాగం ప్రధాన పాత్ర పోషించాయన్నారు. అమరుల త్యాగాలను వృథా కాకుండా చూసుకోవడం ప్రతీ భారతీయుని బాధ్యత అన్నారు. శాంతి, సమగ్రత కోసం మిలటరీ, సివిలియన్ సమన్వయంతో దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరికి పాత్ర ఉందనీ అన్నారు. దేశం కోసం ప్రాణాలు పెట్టిన సైనికుల బాటలో నడిచే విధంగా యువతను ప్రేరేపించాలనీ దేశభక్తిని పెంపొందించుకునే విధంగా విద్యా సంస్థల్లో దేశరక్షకుల ఘనతను తెలియజేయాలనీ తెలిపారు. అమరుల కుటుంబాలకు మా హృదయపూర్వక సానుభూతి, కృతజ్ఞతలు.వారి త్యాగం వలన మనం నేటి స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని వారసత్వంగా వీరత్వాన్ని కొనసాగేలా అమర వీరులకు జ్ఞాపకాల రూపంలో స్మారకాలు, పార్కులు, స్కాలర్షిప్ల ఏర్పాటు చేయడం ద్వారా వారి సేవలను చిరస్థాయిగా గుర్తుంచుకోవాలనీ సూచించారు. సేనల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో ఎన్డియే కూటమి ప్రభుత్వం భారత సైన్యానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సరైన వనరులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.భద్రతా రంగంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ ముందుకు తీసుకుపోతున్నారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి పి కృష్ణారావు, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, మాజీ సైనికులు డాక్టర్ మేజర్ రాంబాబు,హరినారాయణ రెడ్డి, రామకృష్ణ, సాయి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలు వెనుకబడి పోతున్నాయి...ముందుకు తీసుకెళ్లండి



– మంత్రికి బిజెపి నేత కృష్ణారావు వినతి

అగ్ని న్యూస్,మార్కాపురం (జులై 26): మార్కాపురం పరిశ్రమలు వెనుకబడి పోతున్నాయని వాటిని ముందుకు తీసుకు వెళ్లాలని బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి పీవీ కృష్ణారావు, మంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఆయన శనివారం పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహం నందు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ను కలిసి వినతి పత్రం అందించారు. మార్కాపురం లోని పలకల పరిశ్రమతో పాటు పలు పరిశ్రమలు ఉన్నప్పటికీ అభివృద్ధి లేక వెనకబడిపోతూ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు జీవన ఉపాధి కోసం వలసలు వెళ్ళవలసిన పరిస్థితి నెలకొన్న తరుణంలో మార్కాపురం లోని పరిశ్రమలను నూతన రూపుదిద్దాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ను పివి కృష్ణారావు కోరారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో ఎంతోమంది కార్మికులు ఉన్నప్పటికీ జీవనోపాధి లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ వలసలు వెళ్ళవలసిన పరిస్థితి వచ్చిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దయచేసి కార్మికులకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పాదర్తి ఆంజనేయులు, డాక్టర్ కిరణ్, సతీష్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో : అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి కేవలం 499/- మాత్రమే only soft copy

## సమాజ సేవలో ప్రధానోపాధ్యాయులు కశ్శెట్టి



అగ్ని న్యూస్,తర్లుపాడు (జులై 26):సమాజసేవ లో ముందుండే ప్రధానోపాధ్యాయుడు ,మార్కాపురం లయన్స్ క్లబ్ డైరెక్టర్ కశ్శెట్టి జగన్,శనివారం తాను పనిచేస్తున్నజగన్నాధపురం ఎంపీపీ స్కూల్ లో విద్యార్థుల అభ్యున్నతి కోసం తన సొంత నిధులు 4500 రూపాయలు వెచ్చించి ప్రతి విద్యార్థికి టై, ఎగ్జామ్ పాడ్ ,కాపీ రైటింగ్ బుక్స్ నోట్ బుక్స్ ,పెన్సిల్స్, స్లేట్స్ అందించడం జరిగింది. విద్యలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారందరికీ తెలుగు,ఇంగ్లీష్ కాపీ రైటింగ్ బుక్స్ దానితోపాటుఎగ్జామ్ ప్యాడ్స్ అందించడం జరిగింది. అలాగే ప్రభుత్వం ఇచ్చిన షూస్, యూనిఫామ్, బెల్ట్ తో పాటు అందరికీ తన సొంత డబ్బు తో టై లు అందించడం జరిగింది. జగన్ ఏ స్కూల్లో పనిచేస్తున్న ఆ స్కూలు అభివృద్ధికి తన సొంత నిధులతో పూర్తిగా అభివృద్ధి చేయడం అలవాటుగా చేసుకున్నారు. పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ గ్రామస్తుల మన్ననలను పొందుతున్న జగన్ ని పలువురు అభినందించారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఎం అనూష పాల్గొన్నారు. అలాగే ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న కశ్శెట్టి జగన్ ని పాఠశాల కమిటీ చైర్మన్ తంగిరాల అనిల్ కుమార్ మాట్లాడుతూ జగన్ సార్ స్కూల్స్ అభివృద్ధి మాత్రమే కాకుండా ప్రజలకు అన్నదానం చేసే వెలుగొండ సత్రానికి అధ్యక్షుడు గా, అలాగే ఈ మధ్య తుమ్మలచెరువు దారిలో ఉండే చిల్లకంపను జే సి బి తో తొలగించడం, అలాగే తర్లుపాడు హిందూ శ్మశానవాటికని దాతల సహకారం తో అభివృద్ధి చేశారని ఇలా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్న జగన్ సార్ ని అభినందించారు. అలాగే జగన్నాధపురం గ్రామం ప్రజలు జగన్ సార్ లాంటి సామాజిక స్పృహ కల్గిన టీచర్ మా ఊరి స్కూల్ కి రావడం మాకు అందరికీ చాలా ఆనందంగా ఉందని గ్రామస్తులు తెలియజేశారు.

## గోవా గవర్నర్‌గా ప్రమాణం చేసిన అశోక్ గజపతిరాజు



(అగ్ని ప్రతినిధి, అమరావతి)గోవా 20 వ గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు గవర్నర్ బంగ్లా దర్బార్ హాలులో సరిగ్గా ఉదయం 11 గంటలకు ఆయనతో గోవా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ తో పాటు ఆ రాష్ట్ర మంత్రివర్గం, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రులు నారా లోకేశ్, సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, పలువురు టీడీపీ ఎంపీలు హాజరయ్యారు.

## కమలా కాన్సెప్ట్ స్కూల్ లో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు






అగ్నిన్యూస్,మార్కాపురం(జూలై26): పట్టణంలోని కమలా కాన్సెప్ట్ స్కూల్ నందు శనివారం ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం కమలా కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంపీ పుల్లయ్య ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ కార్గిల్ విజయ్ దినోత్సవం ప్రతిఏటా జూలై 26 న దేశవ్యాప్తంగా నిర్వహిస్తారని, 1999 జూలై 26 న భారత సైన్యం పాకిస్తాన్ సైన్యంపై సాధించిన విజయం దానికి గుర్తుగా ఈ రోజును కార్గిల్ విజయ దివస్ జరుపుకుంటున్నామని తెలియజేశారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద జరిగే వేడుకల్లో భారత ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొని అమర వీరులకు నివాళులు అర్పిస్తారని తెలియజేశారు. అంతేకాకుండా పిల్లలు పిల్లల్లో దేశభక్తి, దేశం పట్ల, జాతీయ సమైక్యత పట్ల అవగాహన కలిగి ఉండాలని తద్వారా ఈ దేశం యొక్క అత్యున్నత పౌరులుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. అనంతరం జరిగిన కార్యక్రమాలలో విద్యార్థులు కార్గిల్ విజయ్ దివస్ ఆకారంలో కూర్చుని, దేశభక్తిని చాటేటువంటి పిరమిడ్స్ రూపాలతో విద్యార్థులను అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## కమనీయంగా చెన్నకేశవ స్వామి శాంతి కళ్యాణం





అగ్నిన్యూస్,మార్కాపురం(జులై26): పట్టణ ప్రజల ఇలవేల్పు అయిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి శాంతి కళ్యాణం శనివారం కమనీయంగా జరిగింది. స్వామి అమ్మవార్లను ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉభయదాతలుగా దేవతి వెంకట సత్యనారాయణ నిహారిక, కవలకుంట్ల చంద్రమోహన్ రెడ్డి ధనలక్ష్మి, చిన్న మనకొండ పాండురంగారావు లక్ష్మి, గని చిన్నప్ప లక్ష్మీదేవి, సన్నిధి రామయ్య రమాదేవి, కనిగిరి సునీల్ కుమార్ సుచరిత దంపతులు పాల్గొన్నారు. శాంతి కళ్యాణం ఏర్పాట్లను ఈ.వో గొలమారి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :


పంతులు
మెన్స్
ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర, మార్కాపురం




# రహదారి చిధ్రం.. ప్రయాణం జర భద్రం..!

అగ్నిన్యూస్,పొదిలి(జులై 26): పొదిలి – ఒంగోలు ప్రధాన రహదారి పై పొదిలి లోని చిన్న బస్టాండ్ సమీపంలో ఉన్న పండు వైన్స్ దగ్గర తారు రోడ్డు చిద్రమై పెద్ద గొయ్యి లాగా ఏర్పడి వాహనదారులు ఆ గుంతలో పడి కాళ్లు చేతులు విరగ్గొట్టుకుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకున్న నాధుడే లేడు, ఇదే రహదారిలో ఎంతో మంది అధికారులు,నాయకులు వెళ్తుంటారు... వస్తుంటారు...మనకెందుకులే అనుకుంటారో ఏమో...ఏమాత్రం కనికరం కూడా లేదు.ఎక్కడ కూడా రోడ్లు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. పైగా వర్షాకాలం కావడంతో ఆ గుంతలో నీరు నిలవడం వలన అది కనిపించక నేరుగా వచ్చి ఆ గుంతలోనే ద్విచక్ర వాహనదారులు పడిన సందర్భాలు కోకొల్లలు. కావున అధికారులు స్పందించి తక్షణమే ఆ గుంతలకు మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు ఈనెల 29 వరకు తుది గడువు




అగ్నిన్యూస్,మార్కాపురం(జులై26):మార్కాపురం, తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు గ్రామంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతి ప్రవేశానికి ఈనెల 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రాచార్యులు బ్రహ్మానంద రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకు ముందు సూచించిన విధంగా కుల ధ్రువీకరణ పత్రాలు ఆన్లైన్లో అప్లోడ్ చేయడంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్న కారణంగా అవి ఈ సమయంలో అవసరం లేదని విద్యార్థులే నేరుగా దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది అన్నారు. పశ్చిమ ప్రకాశం జిల్లాలోని ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పత్రికా ముఖంగా కోరారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :

## చంద్రబాబు లాంటి విజనరీ ఉన్న నేత రాష్ట్రాభివృద్ధికి ఎంతైనా అవసరం




– రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

అగ్నిన్యూస్,మార్కాపురం(జులై26): నియోజకవర్గంలోని కొనకనమిట్ల మండలంలో చినమనగుండం గ్రామంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, స్థానిక మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి లు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటగా గ్రామంలోని స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఇంటింటికి వెళ్లి మంత్రి, పార్లమెంట్ సభ్యులు, స్థానిక శాసనసభ్యుల వారు పాంప్లెట్లు పంచి గత సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేసిన సంక్షేమ పథకాల గురించి సవివరంగా వివరించారు.అనంతరం గ్రామస్తులు ఉద్దేశించి మాట్లాడుతూ దొంగే దొంగ అన్నట్టుగా వైసిపి నాయకుల పరిస్థితి ఉందని తెలుగుదేశం ప్రభుత్వం మోసపు హామీలు ఇచ్చిందని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.ఇచ్చిన మాట కట్టుబడి 3000 రూపాయలు పెన్షన్ ను ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 4వేల రూపాయలకు పెంచామని, తల్లికి వందనం పథకము ద్వారా కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్న వారి తల్లి అకౌంట్లో ప్రతి ఒక్క విద్యార్థికి 13వేల చొప్పున జమ చేసామని గుర్తు చేశారు.దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు.అన్నా క్యాంటీన్ ల ద్వారా ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా పథకం ద్వారా ఆగస్టు నెలలో ప్రతి రైతు ఎకౌంట్లో 20,000 రూపాయలు వేస్తున్నాము అన్నారు. డీఎస్సీ ద్వారా నిరుద్యోగులకు 16, 500 టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామని అన్నారు.ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో దాదాపు 8 లక్షలు ఉద్యోగాలు ఇస్తామని అన్నారు.వైసీపీ నాయకులు అహంభావంతో మాట్లాడిన మాటలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పి 11సీట్లు పరిమితం చేశారని అయినా వారికి ఇప్పటికి బుద్ధి రాలేదని అన్నారు.ఈ కార్యక్రమంలో కొనకన మిట్ల మండల నాయకులు, చినమనగుండం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఐద్వా మార్కాపురం పట్టణ మహాసభను జయప్రదం చేయండి



### ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపు

అగ్నిన్యూస్,మార్కాపురం(జులై26): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మార్కాపురం పట్టణ కమిటీ సమావేశం శనివారం స్థానిక సుందరయ్య భవన్ లో ఎస్.కె రెహానా అధ్యక్షతన జరిగినది.ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ ఆగస్టు 6వ తేదీన జరుగుతున్న మార్కాపురం పట్టణ ఐద్వా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. మహిళల మీద నిత్యం జరుగుతున్న హింస,అత్యాచారాలకు వ్యతిరేకంగా చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాలను ఈ మహాసభలో రూపొందిస్తామని తెలిపారు. మద్యం షాపులకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చి లక్ష్యాలు పెట్టి వ్యాపారంగా మార్చడం సిగ్గుచేటైన విషయమని అన్నారు. నిత్యవసర వస్తువులు, మంచినీళ్లు దొరకని ప్రాంతాల్లో కూడా మద్యం దొరుకుతున్నదని అన్నారు. మద్యం, మత్తు మందులు విపరీతంగా పెరగడంతో మహిళల రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు, చర్యలు చేపట్టాలని,ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రభుత్వాలు బలహీనం చేస్తున్నాయని ఆహార భద్రతచట్టానికి తూట్లు పొడుస్తు న్నాయని మండిపడ్డారు. వీటితో పాటు స్థానికంగా మహిళలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య, శివారు కాలనీలకు ఇప్పటికీ పైప్ లైన్లు సక్రమంగా లేని కారణంగా ట్యాంకర్ల ద్వారానే మంచి నీరు అరకొరగా అందిస్తున్న దుస్థితి మార్కాపురం పట్టణంలో నెలకొందని అన్నారు. ప్రజల కనీస అవసరాలను ప్రభుత్వాలు పట్టి పట్టనట్టు వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఈ మహాసభలో మహిళా సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యక్రమం తీసుకోబోతున్నామని మహిళలంతా ఈ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి కె ఎం రఫీ, పట్టణ కార్యదర్శి రూబెన్ ప్రసంగించారు. ఐద్వా పట్టణ కార్యదర్శి డి. శారా, పట్టణ అధ్యక్షురాలు ఎస్.కె రెహానా బేగం పట్టణ కమిటీ సభ్యులు బుజ్జమ్మ, ఎస్ కె బేబీ, జి.మార్తమ్మ, దేవమణి.పాల్గొన్నారు.



# ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

## - రాష్ట్ర మంత్రి ఆనం కు ఎమ్మెల్యే ముత్తుముల వినతి

అగ్ని న్యూస్, గిద్దలూరు (జూలై 26): రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, ప్రకాశం జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ ఆనం రామనారాయణ రెడ్డి ని, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి శనివారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గం లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను మంత్రి కి విన్నవించారు. గిద్దలూరు నియోజకవర్గం లోని దేవాలయాలకు సంబంధించిన డిడిఎన్ ఎస్ స్కీమ్ త్వరితగతిన విడుదల చేయాలని,ఇప్పటికే మంజూరైన ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల నిర్మాణానికి డిఎంఎఫ్ నిధులను విడుదల చేయాలని, సిజిఎఫ్ గ్రాంట్ నుండి బెస్తవారిపేట మండలం, మోక్షగుండం లోని శ్రీ ముక్తేశ్వరస్వామి దేవస్థానం, గిద్దలూరు మండలం, నరవ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కొమరోలు లోని శ్రీ రామాంజనేయ, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించవలసిందిగా అభ్యర్థించారు. ఈ అంశాల పై మంత్రివర్యులు సానుకూలంగా స్పందించి, ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే ముత్తుముల తెలిపారు.

స్థాపితం : 2001
శ్రీ విద్య కోచింగ్ సెంటర్
బ్రాంచ్ -1 : ఆంజనేయ స్వామి గుడి ప్రక్కన
బ్రాంచ్ -2 : ఐడియల్ కాలేజి బజార్, మార్కాపురం
నవోదయ కోచింగ్
6 వ తరగతి ప్రవేశం కొరకు శిక్షణ ఇవ్వబడును
ఆన్‌లైన్ అప్లికేషన్ రిజిస్ట్రేషన్ చివరి తేది : 29 జులై 2025
పరీక్ష తేది : 13 డిసెంబర్ 2025
క్లాసులు ప్రారంభం
అడ్మిషన్లు జరుగుచున్నవి
హాస్టల్ వసతి కలదు
DIRECTOR : Ch.Sreedhar, M.A.,B.Ed
Cell : 94407 07022

SR INFRA
ANANDINI APARTMENTS
గృహప్రవేశమునకు సిద్ధముగా ఉన్నవి





3BHK & 2BHK FLATS FOR SALE
Lakshmi Chennakesava Nagar,
Opp. Eswaramma Temple,
SBI Main Branch Backside, MARKAPUR.
CALL NOW
PERAM SURESH 83283 67911
RAMADUGU RAMESH 94402 48470
YELUGURI PRASAD 99859 70863

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో : అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

# అంగన్వాడీ కేంద్రం లో ఆటపాటలతో కూడిన విద్య





అగ్ని న్యూస్, మార్కాపురం (జూలై 26): పట్టణం లోని డ్రైవర్స్ కాలనీ లోని కోడ్ నం 6 అంగన్వాడీ కేంద్రం లో చిన్నారులకు ఈసిసిఈ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త షబ్నం, చిన్నారుల కి ఆటపాటలతో కూడిన విద్య అభ్యసనం చేయించారు. కార్యక్రమంలో ఆయా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఏపీ చీఫ్ వైయస్ షర్మిల రెడ్డి తో ఇరిగినేని భేటీ




అగ్ని న్యూస్,కనిగిరి (జూలై 26): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆంధ్ర రత్నభవన్ లో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డిని ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా తో కలిసి కనిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇరిగినేని వెంకట నరసయ్య కలిశారు. ఈ సందర్భంగా ఆమెతో జిల్లా పార్టీ నిర్మాణంపై అనేక విషయాలను చర్చించారు ప్రధానంగా కనిగిరి నియోజకవర్గంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ఏ విధంగా కృషి చేయాలి ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్నటువంటి రాజకీయ పరిస్థితులు, పార్టీల బలా,బలాలు తదితర అంశాలపై ఇరిగినేని, షర్మిలమ్మతో భేటీ అయి పలు విషయాలను ప్రస్తావించారు. తమ కుటుంబ నేపథ్యం, రాజకీయాల్లో గతంలో పెద్దాయన ఇరిగినేని తిరుపతి నాయుడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, శాసనసభ్యుడిగా పనిచేసి కనిగిరి నియోజకవర్గంలో ఏ విధంగా ప్రజలకు సేవలు అందించేవారు, అలాగే కనిగిరి నియోజకవర్గం ఏ విధంగా అభివృద్ధి పరిచారు తదితర విషయాలపై ఇరిగినేని వెంకట నరసయ్య, షర్మిలమ్మకు వివరించారు.



RK అగ్ని న్యూస్ The Power Of Truth
27 ఆదివారం, జులై 2025

# కిట్స్ లో కార్గిల్ దినోత్సవం సందర్భంగా అమరులకు ఘన నివాళులు

అగ్ని న్యూస్, మార్కాపురం (జూలై 26):

కృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలోదేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన కార్గిల్ అమరవీరులను స్మరించుకుంటూ, కృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ మార్కాపురం లో కార్గిల్ విజయ దినోత్సవం వేడుకలను ఎంతో గౌరవప్రదంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల కార్యదర్శి అన్న కృష్ణ చైతన్య మార్గదర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉదయం రెండు నిమిషాల పాటు మౌనంగా నిలిచి అమర జవాన్లకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విభాగాధిపతులు మరియు ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూకార్గిల్ యుద్ధంలో మన దేశం కోసం ప్రాణాలను అర్పించిన వీర జవాన్ల త్యాగం ఎప్పటికీ మరువలేనిది. దేశభక్తి అంటే పదాల్లో చెప్పే విషయం కాదని, ప్రతి పౌరుడి మనసులో ఉండవలసిన బాధ్యతగా భావించాలి. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల ద్వారా త్యాగాలను గుర్తుచేసుకుంటూ, దేశానికి ఉపయోగపడే విధంగాతమ జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి" అనిఅన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు మనలో దేశభక్తిని పెంపొందించడమే కాక, దేశ రక్షణలో భాగస్వాములైన జవాన్లపై గౌరవాన్ని కలిగిస్తాయి. విద్యార్థుల్లో సామాజికబాధ్యతను పెంచేలా ఎన్ఎస్ఎస్ యూనిట్ చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయమైనవి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు పలు దేశభక్తి నినాదాలు చేస్తూ క్యాంపస్ లో సందేశాత్మకంగా ఏర్పాట్లు చేశారు. త్యాగం, ధైర్యం, దేశభక్తి వంటి అంశాలను ప్రతిబింబించే పతాకాలు, నినాదాలు మరియు పోస్టర్లు విద్యార్థుల్లో జాతీయ చైతన్యాన్ని రేకెత్తించాయి. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.



# పేదరికం లేని సమాజాన్ని రూపొందించటమే పీ 4 కార్యక్రమ లక్ష్యం

**మొదటి పేజి తరువాయి**

ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 కోసం రాష్ట్రప్రభుత్వం రూపొందించిన విజన్ యాక్షన్ ప్లాన్ లో పది సూత్రాలు ఉన్నాయన్నారు. వీటిలో పేదరిక నిర్మూలన కూడా ఒకటి అని చెప్పారు. పీ 4 ద్వారా పేదరికం లేని సమాజం ఆవిష్కృతం కావాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యమని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా సమాజంలో అభివృద్ధి పరంగాపై స్థాయిలో ఉన్న 10 శాతం ప్రజలు, కింది స్థాయిలో పేదరికంతో బాధపడుతున్న 20% కుటుంబాలకు పలు రకాలుగా చేయూతనిచ్చి పేదరికాన్ని ఆయా కుటుంబాలు అధిగమించేలా చూడడమే ఈ పథకం ఉద్దేశమని తెలిపారు. ఈ దిశగాచేయూత అవసరమైన కుటుంబాలు ప్రకాశం జిల్లాలో 74 వేలకు పైగా ఉన్నట్లు గుర్తించామన్నారువీటిని బంగారు కుటుంబాలు గా పేర్కొంటున్నట్లు చెప్పారు. ఆయా కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచే వారిని మార్గదర్శకులు అని పేర్కొంటున్నట్లు తెలిపారు. మార్గదర్శకులు ఆర్థిక సహాయమే చేయాలన్నది ఈ పథకం ఉద్దేశం కాదని, బంగారు కుటుంబాలు పేదరికాన్ని అధిగమించేలా వివిధ రకాలుగా మార్గదర్శకం చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా అవసరాలను, కుటుంబాలను సచివాలయ సిబ్బంది ద్వారా ఇప్పటికే గుర్తించామన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ సైట్ లో ఈ వివరాలనుపొందుపరిచినట్లు చెప్పారు. ప్రభుత్వము అందిస్తున్న సంక్షేమ పథకాలకు అదనంగా ఇతర సహాయం ఏమైనా బంగారు కుటుంబాలకు అవసరమని గుర్తిస్తే, ఆ దిశగా సహాయం చేసేందుకు మార్గదర్శకులు ముందుకు వచ్చేలా చూడాలని మంత్రి కోరారు. పేద కుటుంబాల్లోని పిల్లలను చదివించడం, ఆయా కుటుంబాలకు అవసరమైన జీవనోపాధి కల్పనకు శక్తి మేరకు కృషి చేయటం,దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యం కోసం చేయూత నివ్వటం, అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి లభించాల్సిన సంక్షేమ పథకాల ప్రయోజనం ఆయా కుటుంబాలకు దక్కనప్పుడు ఈ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లి లబ్ధి కలిగేలా చూడటం వంటి సహాయం చేయవచ్చని చెప్పారు. బంగారు కుటుంబాలకు ఉన్న ఆర్థికేతర అవసరాలను తీర్చుకోవటముపై అవగాహన కల్పించవచ్చన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలు, ఆశయ సాధనకు అనుగుణంగా సహాయం చేసే శక్తి ఉన్న వారందరూ తమ వంతు బాధ్యత తీసుకునేలా చూడాలని పిలుపునిచ్చారు. మంత్రి స్వామి మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం సాధికారత సాధించేలా అవసరమైన మార్గదర్శకులను గుర్తించాలని ఉద్యోగులకు చెప్పారు. 2047 నాటికి రాష్ట్రంలో పేదరికం ఉండకూడదు అన్నది ముఖ్యమంత్రి ఆలోచనగా తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచన విధానం, ఆశయస్ఫూర్తితో ఉద్యోగులు పనిచేయాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. ఎంపీ మాట్లాడుతూ మెరుగైన సమాజం కోసం ముఖ్యమంత్రి వినూత్న ఆలోచనలతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. పి 4 పథకంలో మార్గదర్శకులను ప్రోత్సహించాలని సూచించారు. నిబంధన మేరకు సి.ఎస్.ఆర్. ఫండ్స్ నుంచి కూడా మార్గదర్శకులు ముందుకు వచ్చేలా చూడాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 74,911 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ఇప్పటివరకు 5434 మార్గదర్శకులు ముందుకు వచ్చి 31,367 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నాటికి అన్ని కుటుంబాలను దత్తత తీసుకునేలా మార్గదర్శకులను గుర్తించడంపై దృష్టి పెట్టామన్నారు. ఈ దిశగా ఇప్పటికే పరిశ్రమలు, ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు విద్యాసంస్థలు,కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పి-4 పథకం యొక్క లక్ష్యాలను, ఉద్దేశాన్ని స్వయంగా తాను వివరించానన్నారు. ఒంగోలు, సంతనూతలపాడు, గిద్దలూరు, మార్కాపురం,కనిగిరి శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు,బి ఎన్ విజయ్ కుమార్,ముత్తుమల అశోక్ రెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, దర్శి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలటిడిపి ఇన్చార్జిలు ఎరిక్షన్ బాబు, గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ పీ 4 కార్యక్రమాన్ని విజయవంతం చేసి, పేదరికం లేని సమాజ ఆవిష్కరణ కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతోపనిచేయాలని అన్నారు. మానవసేవే మాధవ సేవగా భావించి ప్రజాప్రతినిధలుగా తాము కూడా ఆదర్శవంతమైన మార్గదర్శకులుగా నిలుస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, అన్ని నియోజకవర్గాల పీ 4 స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.




Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)